క్లుప్తంగా

పేదలకు అండగా కాంగ్రెస్



కన్‌సాన్‌పల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వట్‌పల్లి(అందోల్): అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ అండగా నిలుస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివరాజ్ అన్నారు. మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇంటికి రూ.5లక్షలు, రైతులకు ఉచిత విద్యుత్, ఏడాదికి రూ.15వేల ఆర్థికసాయం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు వీరేశం, మాజీ ఎంపీటీసీలు బాలయ్య, రమేశ్, నాయకులు మహిపాల్, జగన్మోహన్‌రెడ్డి, మల్లేశం, కృష్ణ, గోవర్దన్, బాల్‌రాజ్, మచ్చేందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని కేరూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. ఏఈఓ భాగేష్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అధికారులు వాహనాల తనిఖీని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని కృష్ణాపూర్ కమాన్ వద్ద ఎఫ్ఎస్‌టీ(ఫ్లయింగ్ స్క్వాడ్ టీం) బృందం సభ్యులు ఝరాసంగం నుంచి జహీరాబాద్ వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీం హెడ్ సత్యనారాయణ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నియమాలను పాటించాలని సూచించారు.

ఘనంగా ఖాదీ మహోత్సవం

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్, సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో ఖాదీ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాశాఖ కార్యాలయ జిల్లా అధికారి అనురాధ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించి ఖాదీ వస్త్రాలను ధరించినట్లు గుర్తు చేశారు. ఖాదీ నేతవస్త్రాలను ధరించి దేశంలో ఖాదీ పరిశ్రమ అభివద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో తార ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు సిద్దులు, పద్మజ, శివ, దీప్తి, అధ్యాపకులు జ్యోత్స్న, దేవేందర్, వినోద్, అరుణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

ఝరాసంగం(జహీరాబాద్): కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొల్లూర్ గ్రామానికి చెందిన బిడెకన్నె సునీత(34) కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. ఈ క్రమంలో కడుపునొప్పి తీవ్రత భరించలేక సోమవారం గ్రామ శివారులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లేశ్వర్ తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పాఠశాల సందర్శన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ముభారక్ పూర్(ఎ) ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి దండు అంజయ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక గంట సమయాన్ని తమ పాఠశాలలోని గ్రంథాలయానికి కేటాయించి పఠన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు కిష్టయ్య, సీఆర్పీ రాజేశ్వర్ ఉపాధ్యాయులు ఉన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

- అభ్యర్థుల ఖర్చుల వివరాలు నిష్పక్షపాతంగా ఉండాలి
- రిజిష్టర్ల నిర్వహణ, ప్రూఫ్‌ఫైలింగ్ తప్పనిసరి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు నిష్పక్షపాతంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కమిటీ నోడల్ అధికారి, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలన బృందాల పనితీరు, ఎన్నికల నిర్వహణ, రిజిస్టర్ల నమోదు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ఆమోదం, ఆమోదయోగ్యంకాని ఖర్చుల వివరాలను రిజిస్టర్లలో పారదర్శకంగా నమోదు చేసి ప్రూఫ్స్ ఫైలింగ్ చేయాలని అకౌంటింగ్ బృందసభ్యులకు సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ ర్యాలీలు, సమావేశాలు తదితర ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. పొరపాట్లకు తావివ్వకుండా సమన్వయంతో పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కమిటీ నోడల్ అధికారి తుమ్మ ప్రసాద్, గ్రీవెన్స్ సెల్ అధికారులు బలరాం, కవిత, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులకు ఎన్నికల నేపథ్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు అమరేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, అల్లం రెడ్డి ఈవీఎం మాక్ పోలింగ్, సీలింగ్, పోలింగ్ తదితర అంశాలపై ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ విచ్చేసి ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు పలు ప్రశ్నలు అడిగారు. ఎన్నికల ట్రైనింగ్‌కు సోమవారం హాజరు కానీ పీఓ, ఏపీఓలు మంగళవారం హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా, తహశీల్దార్ భాస్కర్ మాస్టర్ ట్రైనర్‌లు మురళీ, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే ఓటేయ్యండి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదేళ్ల కాలంలో తాను నియోజవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు వెంకటయ్యగౌడ్, వెంకటస్వామిగౌడ్, రమేష్‌గౌడ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే ఇతర పార్టీలకు చెందిన అనేకమంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో...

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. భారతినగర్, రామచంద్రాపురం డివిజన్‌లలో ఆదివారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు పుష్ప, సింధు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపై దాడి అప్రజాస్వామికం

ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి అప్రజాస్వామికమని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజాతీర్పును ఎదుర్కొనలేకనే భౌతిక దాడులు, హత్యా రాజకీయాలకు తెగబడడం దారుణమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన చైర్మన్ నరోత్తం, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఖండించాలి

పటాన్‌చెరు: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలు సహజమని, భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి పెనుముప్పన్నారు. హింస రాజకీయాలను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు.

ఎంపీపై దాడి అమానుషం

జోగిపేట (అందోల్): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడం అమానుషమని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌చైర్మన్ మఠం భిక్షపతి ఖండించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటిస్తున్న ఆయనపై కత్తితో దాడి చేయడం దుర్మార్గమన్నారు. ప్రభాకర్‌రెడ్డి త్వరగా కొలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ముమ్మాటికీ ప్రతిపక్షాల దాడే

సంగారెడ్డి: ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి ముమ్మాటికీ ప్రతిపక్షాల కుట్రనేనని సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. అధికారం కోసం ప్రతిపక్షాలు ఇంతటి దారుణానికి ఒడిగట్టడం సరి కాదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెచ్చగొట్టే ప్రసంగాలతో హింస రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కక్కర్‌వాడ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి దేవిప్రసాద్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడు తూ అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, యూత్ అధ్యక్షుడు సంజీవ్, నాయకులు భోజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేష్‌కుమార్, శ్రీనివాస్, శర్నప్ప, రాజు, సిద్దప్ప, రుద్రప్ప, సంగన్న పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ ఆధ్వర్యంలో..

జహీరాబాద్: పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీ సంఘం నాయకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎన్నికల కోఆర్డినేటర్ దేవిప్రసాద్, నాయకులు బండి మోహన్, యాకూబ్, శివప్ప, రాకేష్ పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

మొగుడంపల్లి మండలం గుడ్‌పల్లి గ్రామంలోని హజ్రత్ సయ్యద్ లతీఫ్ ఖాద్రి దర్గాను ఎమ్మెల్యే మాణిక్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా ముత్‌వల్లీ నయిముద్దీన్ ఖాద్రి నాయకులు కుత్‌బుద్దీన్, జహంగీర్, యూసూఫ్, హఫీజ్, నదీమ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృత్తికా నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కృత్తికా నక్షత్ర వేడుకలను సోమవారం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం, సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం వాసవిమాత పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నవదంపతులపై దాడి

- అడ్డుకోబోయిన యువకుడిపై కత్తితో దాడి
- యువతి కుటుంబసభ్యులపై కేసు నమోదు
- ఉలిక్కిపడిన గ్రామస్తులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిల్

హత్నూర(సంగారెడ్డి): నెల రోజుల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్న నవదంపతులపై కత్తులతో దాడి చేసి యువతిని బలవంతంగా తీసుకెళ్లారు. హత్నూర మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీరుడి అనిల్ రామచంద్రాపురం మండలంలోని స్టేషన్ నాగులపల్లి గ్రామానికి చెందిన అశ్విని (దగ్గరి బంధువులు) నెల రోజుల క్రితం ఇరువురి కుటుంబాలకు తెలియకుండా ప్రేమ వివాహం చేసుకున్నారు. తమకు ప్రాణ భయం ఉందని పోలీసులను ఆశ్రయించగా ఇరు కుటుంబాలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. దీంతో అప్పటినుంచి నస్తీపూర్‌లోని అనిల్ ఇంటి వద్దే నూతన దంపతులు ఉంటున్నారు. ఇదిలా ఉండగా వచ్చే నవంబర్ 5న పెద్దల సమక్షంలో వివాహం జరిపించేందుకు యువకుడి కుటుంబీకులు నిశ్చయించి పెళ్లిపత్రికలు ముద్రించారు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబీకులు, బంధువులు సోమవారం తెల్లవారుజామున నస్తీపూర్‌లోని అనిల్ ఇంటిపై దాడి చేసి యువతిని బలవంతంగా తీసుకెళ్తున్న క్రమంలో అడ్డుకోబోయిన భర్త అనిల్‌పై కత్తితో తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలైన అనిల్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనిల్ తండ్రి నీరుడి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుకుమార్ తెలిపారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

జహీరాబాద్ టౌన్: కలెక్టర్ ఆదేశాలను పట్టించుకొని కోహీర్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం రాంచందర్ మాట్లాడుతూ మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 81లో ఎస్సీ, బీసీలకు చెందిన భూములు ఉన్నాయన్నారు. ధరణి వచ్చినప్పటికీ నేటికీ రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వలేదన్నారు. ఇదే విషయమై పలుమార్లు కలెక్టరేట్‌లో వినతిపత్రాలు ఇవ్వగా స్పందించిన కలెక్టర్ మాచిరెడ్డిపల్లి రైతుల ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కానీ.. తహసీల్దార్ స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆర్డీఓ వెంటనే జోక్యం చేసుకుని రైతుల ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపించి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

కల్యాణమేళాలో బసవ భక్తులు



శోభయాత్రలో జహీరాబాద్ అక్కనబళగ సభ్యులు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ రాష్ట్ర బాడర్‌లోని బసవకళ్యాణలో కొనసాగుతున్న 22వ కల్యాణ మేళాలో జహీరాబాద్‌కు చెందిన బసవ భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు శంకర్ పాటిల్, జగద్గురు గంగమాతాజీ, రాష్ట్రీయ బసవదళ్ జహీరాబాద్ నాయకులు నగేష్, యశ్వంత్‌రావు, అప్పరావు అక్కనబళగ సభ్యులు పాల్గొన్నారు.

చిరుత కలకలం

భయాందోళనలో ప్రజలు



చిరుత సంచారంపై ఆనవాళ్లను సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామ శివారులో చిరుత సంచరిస్తుందన్న వదంతులు మండలంలో కలకలం రేపుతున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన రైతు రాంచందర్‌రావు వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తున్న నాగరాజు శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అటువైపుగా చిరుత సంచరించినట్లుగా తన యజమాని ద్వారా ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాడు. దీంతో అధికారులు చిరుత సంచరించిన ప్రదేశానికి వెళ్లి చిరుత కాలిముద్రలను గుర్తించడం వంటి గాలింపు చర్యలు చేపట్టారు. చిరుత సంచారంపై రెండు మూడు రోజులుగా విచారణ చేస్తున్నా నేటికీ ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదని, సమాచారం సేకరిస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, చిరుత కనిపిస్తే సమాచారం అందించాలని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వేణు, బీట్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ తెలిపారు.

భయాందోళనలో స్థానికులు

చిరుత సంచరిస్తుందనే విషయం తెలియడంతోమ చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిరుత సంచారంపై అధికారులు త్వరగా నిజానిజాలను తేల్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఠాగూర్ రాజేందర్‌సింగ్‌కు సన్మానం



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలో ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు క్షత్రియ రాజ్‌పుత్ సమాజ్ అధ్యక్షుడు ఠాగూర్ రాజేందర్‌సింగ్ (రాజన్ బాయ్)ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహారాణా ప్రతాప్ సేవాసమితి చైర్మన్ ఠాకూర్ అర్జున్, అధ్యక్షుడు ఠాకూర్ విజయ్ దినేష్ సింగ్, కార్యదర్శులు ఠాగూర్ విపిన్ రాజ్‌సింగ్, ఠాకూర్ శివానందసింగ్, అడ్వైజర్స్ నర్సింగ్ ఠాకూర్, విశ్వజిత్‌సింగ్, యశ్వంత్‌సింగ్, నరేష్‌సింగ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **గులాబీ జెండా ఎగురవేస్తాం**



కంగ్టి(నారాయణఖేడ్): ఖేడ్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఖేడ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాదసభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో ఖేడ్ నుంచి సిర్గాపూర్, కల్హేర్ మండల కేంద్రాల మీదుగా మాసానిపల్లిని డబుల్‌రోడ్డు, నల్లవాగు ప్రాజెక్టుతో రెండు పంటలు పండించేందుకు గాను రూ.80 కోట్లతో ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని, మెదక్ జిల్లాలో ఉన్న పెద్దశంకరంపేట, రెగోడ్ మండలాలను సంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలని సీఎంకేసీఆర్‌ను కోరారు.

◆ **మద్యం బాటిళ్లు స్వాధీనం**

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా విక్రయించేందుకు తీసుకువచ్చిన ఆరు లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. అమీన్‌పూర్ ఎస్ఐ రమణ తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని పీఎస్ఆర్ కాలనీ సమీపంలో గుడిసెలు వేసుకుని ఉంటున్న వడ్డే మల్లేష్ గుట్టుచప్పుడు కాకుండా బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

◆ **వ్యక్తి అదృశ్యం**



అబ్దుల్ అన్సారీ

పటాన్‌చెరు టౌన్: జార్ఖండ్‌కు వెళ్తున్నానని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అబ్దుల్‌అన్సారీ(26) బతుకు దెరువు కోసం వచ్చి పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉంటూ పారిశ్రామికవాడలోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22న జార్ఖండ్ రాష్ట్రానికి వెళ్తున్నానని బ్యాగు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిన అబ్దుల్ అన్సారి ఇంటికి చేరుకోలేదు. దీంతో అతడి సోదరుడు కుర్షిద్ అన్సారీ అబ్దుల్‌అన్సారికి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో స్వగ్రామానికి ఫోన్ చేసినా రాలేదని చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. అబ్దుల్‌అన్సారి అదృశ్యంపై కుర్షిద్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **11మందిపై కేసు**

పటాన్‌చెరు టౌన్: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన 11మందికి జరిమానా విధించి కేసు నమోదు చేసిన సంఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ సీతారామరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అమీన్‌పూర్, రామచంద్రాపురం పరిధిలోని వైన్‌షాప్‌ల వద్ద పర్మిట్ రూమ్‌లో కాకుండా బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండగా కేసు నమోదు చేసి జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు.

◆ **ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం**

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కోఆర్డినేటర్ అనురాధ మాట్లాడుతూ రాచరిక రాష్ట్రాలను భారత యూనియన్లో చేరేలా ముఖ్యమైన పాత్ర పోషించిన భారతదేశ మొదటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా ప్రతి ఏడాది సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పతాంజలి, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం**

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపు కోసం పట్టణంలోని 2, 3, 8, 23, 25వ వార్డుల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, 23వ వార్డు కౌన్సిలర్ కంది ఇంద్రమోహన్‌గౌడ్, 2వ వార్డు ఇన్‌చార్జి ఖాజాపాష, 3వ వార్డు కౌన్సిలర్ చౌదరి ప్రకాష్, 8వ వార్డు కౌన్సిలర్ వడ్ల మహేశ్వరీ నాయకులు కోడూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **నిరుపేదలకు పట్టాలివ్వాలి**

సదాశివపేట(సంగారెడ్డి): సిద్దాపూర్ కాలనీలోని 260 సర్వేనంబర్‌లో పూరిగుడిసెలు వెసుకొని జీవిస్తున్న నిరుపేదలకు పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రహమాన్, సాదక్ అలీ, ముస్తఫా, యాకుబ్‌అలి, పోచయ్య, దత్తుస్వామి, ఉమేష్, దేవదాస్, వెంకటేశం, పూలమ్మ పాల్గొన్నారు.

◆ **ఉపాధిహామీని అమలు చేయాలి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో సోమవారం అయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నవారికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

◆ **'ఆర్యవైశ్య సంఘంతో సంబంధంలేదు'**

సంగారెడ్డి: బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను కలిసిన వారికి సంఘంతో సంబంధంలేదని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పాంపాటి కృష్ణమూర్తి అన్నారు. సంగారెడ్డి పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చింతా ప్రభాకర్‌కు మద్దతు తెలుపుతున్నట్లు కొంతమంది స్థానికంగా ఉన్న ఆర్యవైశ్యులు ఆయన వద్దకు వెళ్లారని, అది వారి వ్యక్తిగతమని చెప్పారు. కానీ.. సంఘం నుంచి ఎవరూ చింతా ప్రభాకర్ వద్దకు వెళ్లలేదని తెలిపారు. సంఘం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎవరికీ మద్దతు ఇవ్వలేదని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చికోటి దయాకర్, గౌరవ అధ్యక్షుడు మ్యాడం రాధాకిషన్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, సభ్యులు జూలకంటి బుచ్చిలింగం, మదన్మోహన్, రాచర్ల ప్రసాద్, అనుముల సంతోష్, శివకుమార్, నామ భాస్కర్, మనోహర్, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, రాకేష్, తిరుమలేష్, వనం ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గృహ నిర్బంధం

కల్హేర్(నారాయణఖేడ్): మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు విజయపాల్‌రెడ్డిని సోమవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. సీఎం ప్రజాఆశీర్వాద సభ, దుబ్బాకలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని ఖానాపూర్(కె)లో ఉన్న ఆయన ఇంటికి వెళ్లి నోటీసు ఇచ్చారు. సభ పూర్తయ్యేంతవరకు గృహ నిర్బంధంలో ఉన్నారు.